# ప్రశ్నలు & సమాధానాలు

## ప్రశ్న 350, దివ్యమైన విద్యుత్ కేంద్రం
**ఫిబ్రవరి 13, 2025**

ఈ ఉద్ధరణ ప్రొ. అనిల్ కుమార్ గారి *Seeking Within,* పేజీలు *108-114* నుండి తీసికొనబడినవి.

ప్రొ. అనిల్ కుమార్ గారు భగవాన్ బాబా వారి సందేశము, ఉపదేశములను ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పడానికి ఎంపిక చేయబడ్డారు. భారత దేశంలోను, ఇతర దేశాలలోను కూడా విస్తారముగా తిరిగి ఎంతో మంది భక్తులు అడిగిన ప్రశ్నలు, సందేహాలు స్వామి చెప్పిన వాక్కులు, ఉపన్యాసాలను మూలంగా తీసుకొని తేటతెల్లం చేసారు. ముఖ్యంగా ప్రొ. అనిల్ కుమార్ గారు మన సర్వాంతర్యామి సాయిని ఎలా చేరుకోవాలో మార్గం చూపుతారు.

ప్ర: మహాసమాధి దర్శనం వల్ల కలిగే లాభములు ఏమిటి?

జ. ప్రొ. అనిల్ కుమార్: మీకు మహాసమాధి దర్శనం వల్ల కలిగే లాభములు ఏమిటో తెలుసుకోవాలని ఉంది. మీరు మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రం గురించి విన్నారా? మొత్తం రాష్ట్రానికి విద్యుత్ అందిస్తుంది. మాచ్‌ఖండ్ లో ఏదైనా సమస్య వస్తే పవర్ కట్ ఉంటుంది. అందరం అంధకారంలో ఉంటాం. అదే విధంగా మహాసమాధి ఒక విద్యుత్ కేంద్రం వంటిది. అక్కడి నుంచి దివ్యాశీస్సులు నిరంతరం ప్రవహిస్తూనే ఉంటాయి. ఈ మహాసమాధి నుండి అనుగ్రహం, కరుణ, దీవెనలు ప్రవహిస్తాయి. అది ఒక లాభం.

మరొకటి కల్పవృక్షం. ఒకప్పుడు అలాంటి వృక్షం ఉండేది ఇక్కడ. బాబాను వదిలేసి దానిని చూడడానికి వెళ్ళేవారు జనం. మనకున్న ఎన్నో కోరికలను ఆ చెట్టు తీరుస్తుందనే ఆశతో బాబాను కాక చెట్టును చూడడానికి వెళ్ళే వాళ్ళం. ఇటీవల ఆ కల్పవృక్షం పడిపోయింది. నా దృష్టిలో ఈ మహాసమాధి ఆ కల్పవృక్షం. మహాసమాధి వద్ద మన ఆశలు, కోరికలు అన్నీ నెరవేరుతాయి.

మహాసమాధి దర్శనం వల్ల ఇంకొక లాభం కూడా ఉంది. అది తెల్లటి పాలరాతితో చేయబడి, చుట్టూ బంగారపు అంచు చెక్కబడి ఉంది. బాబా వారి పుట్టుపండుగ నాడు తెల్లటి అంగీ ధరిస్తారు. లోన పంచెకి బంగారపు అంచు ఉంటుంది. ఈ మహాసమాధి ఎల్లప్పుడూ బాబా వారి పుట్టుపండుగ వస్త్రములు ధరించి ఉంటుంది.

మీరు శ్రీ రంగనాథ స్వామి, మోహన రంగనాయక స్వామి, శ్రీ మహావిష్ణు, అనంత పద్మనాభ మూర్తి గురించి విని ఉంటారు. వారందరూ శయన స్థితిలో కనబడతారు. ఇప్పుడు మన సాయి రంగ, శ్రీ సత్య సాయి పాండురంగ భగవాన్ సమాధిలో శయనించి అందరికీ దర్శనం, దివ్యాశీస్సులు అందిస్తున్నారు అని భావిస్తాను.

ప్ర: స్వామి ఎప్పుడూ మనతోనే ఉంటారు. మనలోని అంతర్యామి. అందరికీ అనుభవమైన విషయమే ఇది. కానీ ఒక్కొక్క సారి ఆయన భౌతిక రూపాన్ని ఎందుకు మిస్ చేస్తాము? ఒక్కొక్క సారి ఏడుపు కూడా వస్తుంది. ఎందుకు?

జ. ప్రొ. అనిల్ కుమార్: ఎందుకంటే మనకు ఇంతవరకూ ఆయనతో మాట్లాడడం అలవాటు. ఆయనకి ఉత్తరాలు అందించి, ఇంటర్వ్యూలు తీసుకోవడం అలవాటు. ఆయనకు పూవులు అందించడం అలవాటు. కానీ

ఇప్పుడు ఆయన భౌతిక స్వరూపం లేదు కనుక మనకి బాధ వేస్తుంది. ఆయన దివ్యానుగ్రహంతో క్రమక్రమంగా అటువంటి భావనలు దూరం అవుతాయి.

ప్ర: కొన్ని సార్లు స్వామి భౌతిక స్వరూపంలో లేరని తలచుకుంటే బాధ వేస్తుంది. ఈ భావనలను ఎలా ఎదుర్కోవాలో తెలియచేయండి. మీరు పూర్వపు అనుభవాలు పంచుకున్నారు. స్వామి భౌతిక స్వరూపం చాలించాక భక్తులకు జరిగిన అనుభవాలు ఏమైనా చెప్పగలరా?

జ. ప్రొ. అనిల్ కుమార్: భౌతిక స్వరూపం లేనందుకు బాధ పడకండి. మన సమక్షంలోనే సాయి ఉనికిని అనుభవించండి. సాయి వైభవం గురించి పాడినప్పుడు, సాయి సాహిత్యం చదివినప్పుడు, ఏదైనా సేవా కార్యక్రమంలో పాల్గొన్నప్పుడు, ఎవరినైనా ప్రేమించినా, క్షమించినా, ఏదైనా పంచి ఇచ్చినా అక్కడ సాయి ఉన్నాడు! నీవే సాయి! సాయి, నీవు ఇద్దరూ ఒక్కరే ఎన్నటికీ.

స్నేహితులారా, మీరు నమ్మినా నమ్మకపోయినా ఎప్పటికంటే ఎక్కువ మహిమలు ఇప్పుడు జరుగుతున్నాయి. మునుపు పుట్టపర్తిలో ఎక్కువ మహిమలు జరిగేవి కాదు. మీకు జరిగిన మహిమలను తెలుసుకొని మేము అందరికీ చెప్పుకొనే వాళ్ళం. కానీ ఇప్పుడు ప్రశాంతి నిలయంలో ఎన్నో మహిమలు జరుగుతున్నాయి. మాకు ఇంకొంత వైద్య చికిత్స, ఆపరేషన్ అవసరం అనుకున్నారేమో. నేను అలా భావిస్తాను.

ఎప్పుడూ జరగనన్ని మహిమలు ఇప్పుడు జరుగుతున్నాయి ఇక్కడ. సౌత్ ఇండియన్ కాంటీన్ గోడ మీద స్వామి పాదముల ముద్రలు పడ్డాయి. సౌత్ ఇండియన్ కాంటీన్ ఆడవారి వైపు స్టోర్ రూమ్ దగ్గిర ఒక నెల పాటుగా స్వామి ఫోటో నుండి అమృతం వస్తూనే ఉంది.

నార్త్ బ్లాక్ లోనో రౌండ్ బిల్డింగ్ లోనో ఒక స్వామి ఫోటో నుండి విభూతి వస్తూనే ఉంది. పుట్టపర్తి గ్రామంలో ఒక ముస్లిం తయారు చేసిన స్వామి విగ్రహంలోనుండి అమృతం వస్తూనే ఉంది. స్వామి తలనుండి విభూతి వస్తూనే ఉంది.

సత్య సాయి బాబా నిత్య సత్య నిర్మలమైన భగవంతుడు. కాల కాలాలన్నిటికీ అవతరించిన దివ్యస్వరూపుడు.

ప్ర: నాది ఒక వ్యక్తిగతమైన ప్రశ్న. సాయి అవతార లక్ష్యంలో మీ పాత్ర మునుపు అనువాదకుడి కంటే ఇప్పుడు స్వామి భౌతిక స్వరూపం చాలించిన తర్వాత మీ పాత్ర ఇంకా పెద్దదౌతుందని ఎన్నడైనా ఊహించారా? స్వామి యొక్క దూతలుగా మన పాత్ర ఆయన భౌతిక స్వరూపంలో ఉన్నప్పటి కంటే ఇప్పుడు ఇంకా ముఖ్యమైనది అంటారా?

జ. ప్రొ. అనిల్ కుమార్: స్నేహితులారా, నన్ను నమ్మండి, నాకు ప్రపంచమంతటా ఉన్న భక్తులందరినీ కలవాలని కోరిక. భారత దేశంలో ఉన్న ప్రతి గ్రామం, పట్టణం, మహా పట్టణానికి వెళ్ళి స్వామి మనను విడిచి వెళ్ళలేదు అని భక్తులందరికీ తెలియజేయాలని కోరిక. ఆయన మనతోనే ఉన్నారు. మీరు బాధ పడి వేరే పార్టీకి వెళ్ళకండి. ఆధ్యాత్మికం రాజకీయం కాదు. చెప్పుడు మాటలు విని, టీవీలలో, వార్తాపత్రికలలో చూసి మోసపోకండి. అవన్నీ ఎవరో పుట్టించిన వ్యర్థప్రసంగాలే.

మీ నమ్మకాన్ని స్థిరపరచుకోండి. సాయి మీతోనే ఉన్నారు. ఇవి నాకు అందరికీ చెప్పాలని ఉంది. ఒక్క రోజు కూడా విరామం లేకుండా ప్రయాణిస్తూ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి భక్తులకు ధైర్యం, నమ్మకం కలిగించాలని కోరిక.

ప్ర: స్వామి అంతటా ఉన్నారు కనుక పుట్టపర్తి వెళ్ళే అవసరం ఉందా?

జ. ప్రొ. అనిల్ కుమార్: భగవంతుడు అంతటా ఉన్నా మీరు దేవాలయానికి ఎందుకు వెళ్తారు? మీరు ఏ గదిలోనైనా పడుకోవచ్చు కానీ పడక గదిలోనే పడుకుంటారెందుకు? వరండాలో నైనా వంట చేసుకోవచ్చు కానీ వంటింట్లోనే వంట చేసుకుంటారెందుకు?

బాబా అంతటా ఉన్నారు. విద్యుత్ వలె అన్ని వేళలా అన్ని చోట్లలో ఉన్నారు. ఆయన శక్తి సర్వవ్యాపకమైనది. కానీ పుట్టపర్తి ఒక విద్యుత్ కేంద్రం వంటిది. ఈ విద్యుత్ కేంద్రం నుండి ప్రపంచమంతటికీ శక్తి ప్రసరిస్తుంది. ఆ దివ్య శక్తికి దగ్గరగా ఉండడానికి ఇక్కడికి వస్తారు.

వచ్చే వారం సర్వాంతర్యామి అయిన స్వామి యొక్క దివ్యమైన ఉనికి గురించి నేర్చుకుందాం. ధన్యవాదములు.

ఓం సాయి రామ్